

# జరత్కారువు

జరత్కారువు యౌవన శోభతో మిలమిల మెరుస్తూ, నాగకన్యల్లో అంత సౌందర్యవతి మరొకతె లేదని పేరు పొందింది. ఆమెకు విపరీతమైన అతిశయం. ఆమె శక్తికీ, గుణగణాలకీ తగిన వరుడు నాగలోకంలో ఎవ్వరూ కనపడలేదు.

అవును, తను సామాన్యురాలా? వాసుకి ప్రియసోదరి. వాసుకి శక్తి సామర్థ్యాలు త్రిమూర్తులకు, దేవతలకు కూడా ఆశ్చర్యాన్ని కలిగించాయి. క్షీరసాగర మథనానికి రాక్షసులు, దేవతలు అనేక యోజనాలు వ్యాపించిన మంథర పర్వతాన్ని కవ్వంగా తెచ్చుకున్నారు కానీ, దాన్ని చుట్టి తిప్పడానికి తగిన తాడు సంపాదించలేకపోయారు. వాసుకి కవ్వపు తాడై, అమృతోత్పత్తికి సహాయకుడయ్యాడు. అలాటి వాసుకి చెల్లెలు జరత్కారువు. ఏ నాగ యువకుడో తనకు భర్తగా సరిపోతాడా-తను ఏ సామాన్యుణ్ణో ప్రేమించనూ లేదు, భర్తగా అంగీకరించనూ లేదు. నవయౌవనంలో ఉన్న తన శరీరాన్ని చూసుకుంది ఒకసారి-తనని తనే ప్రేమించుకునే టంత అందగత్తె తను. ఆ ఎర్రని పాదాలు, విశాలమైన నయనాలు, నిగనిగలాడే కేశాలు, నున్నని బాహువులు చూసుకుంటూ ఆ నీరెండలో సురపొన్న చెట్టు కింద కూచుంది జరత్కారువు.

అన్న వాసుకికి జరత్కారు వంటే చాలా ఇష్టం. ఆమె ఏది కోరితే అది తెచ్చి ఇస్తాడు. ఆమె ఎవరిని కోరితే వారిని తెచ్చి వివాహం చేయగలడు. తమ వంశం గుణశీలాలకు ప్రసిద్ధి పొందింది. తను ఎవర్నో ఒకర్ని ఎలా వివాహం చేసుకుంటుంది? మరి ఇలా ఎంతకాలం? తన యౌవనమంతా వృథా కావలసిం దేనా? స్త్రీగా, మాతృమూర్తిగా తన జీవితం ధన్యత చెందే దెలా? తన వివాహ విషయం జ్ఞాని అయిన అన్నగారే నిర్ణయించాలి అనుకుంది చెక్కిట చేయిచేర్చి సురపొన్న చెట్టుకేసి చూస్తూ జరత్కారువు.

ఒక రోజు అనేకమంది నాగకుల ప్రముఖులు వ్యాకులచిత్తులై వాసుకి దగ్గరకొచ్చారు. జనమేజయుడు సర్పయాగాన్ని తలపెట్టాడనీ, నాగకులాన్ని అంతం చేస్తానని ప్రతిజ్ఞ చేశాడనీ చెప్పి, అతన్ని వారించేందుకు యుద్ధసన్నద్ధులం కావాలని కోరారు. తన చెల్లెలు జరత్కారువుకు పుట్టే మహానుభావుడు నాగకుల రక్షకు డవుతాడని తాను పూర్వం విన్నాడు. ఆ విషయం చెప్పి నాగకుల ప్రముఖుల భయాన్ని వారించాడు వాసుకి. సమయంకోసం ఎదురు చూస్తున్నాడంతే!

యౌవనభారంతో గృహంలో కనిపిస్తున్న చెల్లెల్ని చూస్తుంటే వాసుకి మనసు వ్యథ చెందుతోంది - ఈమెకు ఎప్పటికి తను వివాహం చేయగలడో, ఆ శుభఘడియ లెప్పుడొస్తాయో అని.

బ్రహ్మచర్య దీక్షతో పరమ తపోధనుడైన మునీంద్రు డొకడు అడవిలో సంచరిస్తూ ఒక విచిత్రాన్ని గమనించాడు. తలకిందులుగా వేలాడుతూ, సూర్య కిరణాలే ఆహారంగా తీసుకుంటూ కృశించిన మహర్షులు కనిపించారు. వారిని సమీపించి ఆ తపస్సు ప్రత్యేకత ఏమిటని ప్రశ్నించాడు. వారు ఎంతో విచారంగా అది తపం కాదనీ, తా మెంతో పాపం చేసుకున్నామనీ తెల్పారు. మునీశ్వరుడు కారణం తెలపమని కోరాడు. తమ వంశంలో పితృకార్యాలు చేసే వారెవరూ లేరనీ, ఉన్న ఒక్క జరత్కారుడు బ్రహ్మచర్యదీక్షతో తపస్సు చేస్తున్నాడనీ, తాము ఆ కారణంగా ఊర్ధ్వలోకాలకు పోలేక ఇలా అధోముఖులై ఉన్నామనీ తెలిపారు. ఎన్ని వ్రతాలు, యజ్ఞాలు చేసినా, ఎన్ని దానాలు ఇచ్చినా సంతానం లేకపోతే అది దోషమే-అని చెప్పి, "అయ్యా! తమ రెవరో తెలియదు. ఆ జర త్కారుడు కనిపిస్తే వివాహం చేసుకుని సంతానవంతుడవు కమ్మని మీరైనా చెప్పండి" అన్నారు దీనంగా.

మునీశ్వరుని మనసు కరిగింది. ధర్మదీక్షాపరుడైన జరత్కారుడు తనే నని తెలిపాడు వారికి. తాను వివాహం చేసుకుని, వారికి ఊర్ధ్వలోకాలు కలిగిస్తా నని వాగ్దానం చేశాడు. అయితే సనామ్ని అయిన కన్యనే వివాహమాడతానని ఒక నియమం పెట్టి, కన్యాన్వేషణంకోసం బయల్దేరాడు జరత్కారుడు. ఎంతో తిరిగాడు. భూలోకంలో సనామ్ని అయిన కన్య దొరకటం దుర్లభమైంది.

చారులవల్ల ఈ విషయం విన్న వాసుకి పరమానందభరితు డయ్యాడు. తన చెల్లెలు జరత్కారువుకు వివాహం చేయడానికి తగిన సమయ మిదే అని నిశ్చయించాడు. జరత్కారుని దీక్షాదక్షతలు తెలుసుకున్న వాసుకి, జరత్కారు వును వెంట బెట్టుకుని జరత్కారుని దగ్గరకు వెళ్ళాడు.

జరత్కారువుకీ, జరత్కారుడికీ వివాహమైంది. జరత్కారువు ఆనందా నికి అవధుల్లేవు. ఆమె భార్యగానేకాక, ఒక మాతృమూర్తిగా జీవితం ధన్యం చేసుకోవాలనే గొప్ప కోరికతో ఉంది.

మొదటి రాత్రే జరత్కారుడు ఒక కఠిన నియమం పెట్టాడు. "నువ్వు ఏనాడైనా నన్ను అవమానపరిచినట్టనిపిస్తే ఆ క్షణంలోనే నిన్ను వదిలి వెళ్ళి పోతాను" అని.

జరత్కారువు విస్తుపోయింది. తన భర్త తనని నిజంగా ప్రేమిస్తున్నాడా, కేవలం ధర్మంకోసం, ధర్మకార్యనిర్వహణకోసం తనను వివాహం చేసుకున్నాడా అని వ్యాకులపడింది మనసులో. అప్పటినుంచీ కత్తిమీద నడుస్తున్నట్టుగానే భయం భయంగా కాపురం చేస్తోంది. నియమవ్రత దీక్షాబద్ధురాలై, రాత్రిం బవళ్ళు భర్తకు సేవ చేస్తోంది. తన గర్భాన ఎంతటి మహానుభావుడు ఉద్భ విస్తాడో నని ఊహించుకుంటూ తన్మయత్వం చెందుతూంది.

ఒకనాడు జరత్కారుడు విశ్రమిస్తున్నాడు. సంధ్యాసమయమైనా నిద్ర లేవలేదు. ఆశ్రమవాసులందరూ సంధ్యాకార్యక్రమాలతో నిమగ్నమవుతున్నారు. భర్తని నిద్ర లేపాలి. కాని, నిద్ర లేపితే, అతనికి కోపమొస్తే? జరత్కారువు క్షణం తటపటాయించింది.

బహుదీక్షాపరుడైన జరత్కారునికి సంధ్యాసమయం అతి పవిత్రమైంది. అతన్ని నిద్ర లేపటం తన ధర్మమే అని నిశ్చయించుకుని, నిద్ర లేపింది. జరత్కారుడు నిద్రాభంగమైనందుకు ఉగ్రుడయ్యాడు. జరత్కారువు శాంతిగా సమాధానపరచ యత్నించింది.

"నువ్వు నన్ను అవమానపరిచావు. నేను పెట్టిన నియమాన్ని అతిక్రమించావు. నీవు మీ అన్న దగ్గర కెళ్ళిపో!"

జరత్కారుని గంభీరస్వరానికి నిశ్చేష్టురాలైంది. తన తప్పు లేకుండానే, తనను తూలనాడుతున్న భర్తకేసి చూసింది.

'సంసార బంధాలమీద మనసు నిలపని భర్తతో కాపురం చేయడంకన్నా మాతృమూర్తిగా, తృప్తిగా జీవించడంలోనే ధన్యత ఉంది' అనుకుంది.

జరత్కారువు ఆమెను అలాగే చూచాడు ఓ క్షణం. అతని మనసు కదిలింది ఒక్క నిముషం. కానీ ఆమెను ఆశీర్వదించి పంపటమే ఉత్తమ మనిపించింది. వెంటనే "నీ గర్భస్థ శిశువు మహాతేజోశాలి, ఉభయ వంశాలను ఉద్ధరిస్తాడు." ఆ మాట అని జరత్కారుడు వెళ్ళిపోతుంటే, అభిమానవతి అయిన జరత్కారువు అతన్ని ప్రాధేయపడదలుచుకోలేదు.

జరత్కారువుకు నవ్వు వచ్చింది. ఎటువంటి భర్త! భార్య మనసును, ప్రేమను గ్రహించలేని భర్త. కనీసం గర్భవతి అని కూడా జాలి కలగలేదు. జరత్కారువు కళ్ళు చెమర్చాయి ఆ నిముషంలో.

తన ప్రణయజీవితం అంత త్వరగా ముగుస్తుందని ఆమె కూడా అనుకోలేదు. అయితే ఆమెకు ఒక్కటే తృప్తి, ఒక్కటే గర్వం. తన జీవితం వృథా కాలేదు! తన గర్భాన మహాశక్తిసంపన్నుడైన పుత్రుడు ఉదయిస్తాడు. అంతే చాలు తనకి! గర్భవతి అయిన జరత్కారువు అన్న దగ్గరకు వచ్చింది. మాతృమూర్తిగా తన స్థానం మహోన్నతం చేసుకోవాలని నిశ్చయించుకుంది.

జరత్కారువు కుమారుడు దిన దిన ప్రవర్ధమానుడవుతూ, సకలవిద్యలూ అభ్యసిస్తున్నాడు. అది చూస్తూ ఆనందపడుతున్నా జరత్కారువు మనసు ఒక్కోసారి వికలమైనా, జరత్కారునితో తన విఫల ప్రేమను మరిచిపోయే ప్రయత్నం చేసింది.

తన కొడుకు ఆస్తీకుడు, అసమాన ప్రతిభావంతుడై కీర్తివంతు డవుతుంటే, తన జన్మ సార్థకమైందని ఆనందబాష్పాలు రాల్చింది మాతృమూర్తి జరత్కారువు.

*

(ఆధారం : శ్రీమదాంధ్ర మహాభారతం :
ఆదిపర్వం : ద్వితీయాశ్వాసం)

(ప్రచురణ : ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక : 5-8-1987)